క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలుప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జీ.సాంబరెడ్డి తెలిపారు. జులైవాడ, ప్రకాశ్‌రెడ్డి ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, కాజీపేటలోని బాపూజీనగర్, బాలాజీనగర్, శాంతినగర్, వెస్ట్ సిటీ, జూబ్లీ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నగరానికి నిధులివ్వండి



వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరంలో వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని నగర మేయర్ గుండు సుధారాణి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌కు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో కలిసి మేయర్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నగరంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు బల్దియా పరిధిలో సుమారు 152 ప్రాంతాలు నీట మునిగాయని పేర్కొన్నారు.

టీఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీపై విచారణకు ఆదేశించాలి

విద్యారణ్యపురి: కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకొని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి టీఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీపై సీబీఐతో విచారణకు ఆదేశించాలని రిటైర్డ్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ బీజేపీ సెల్ రాష్ట్ర కోచైర్మన్ తిరువరంగం ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు. గతంలోనే అవినీతికి అక్రమాలకు నిలయంగా ఉన్న గచ్చిబౌలి టీఎన్‌జీవోస్ హౌసింగ్ సొసైటీలోని ఇళ్ల ప్లాట్లను క్రమబద్ధీకరిస్తామని వారం రోజుల క్రితం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. దీన్ని బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ సెల్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


మోహన్‌రెడ్డి


విక్రమ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ విభాగంలో ఇద్దరి పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. రీజినల్ మూవ్‌మెంట్ అండ్ ఓటింగ్ బిహేవియర్ – ఏ స్టడీ ఇన్ నిజామాబాద్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఎం.మోహన్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ రాంచంద్రం పర్యవేక్షణలో మోహన్‌రెడ్డి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, రోల్ ఆఫ్ ది పొలిటికల్ పార్టీస్ ఇన్ తెలంగాణ మూవ్‌మెంట్ 2001 – 2014 ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి జీ.విక్రమ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మల్లారెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ రాంచంద్రం పర్యవేక్షణలో విక్రమ్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వైద్యుల అరెస్టు సరికాదు

కాశిబుగ్గ: ఏఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ వైద్యులను అరెస్ట్ చేయడం సరికాదని పల్లె దవాఖాన డాక్టర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.అరుణ్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో ఖండించారు. సెకండ్ ఏఎన్ఎంల అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో వారిని అరెస్ట్ చేసిన పోలీసులు.. ఎలాంటి పిలుపు ఇవ్వని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ వైద్యుల (పల్లె దవాఖాన వైద్యులు, ఆర్‌బీఎస్‌కే, ఎన్ఆర్‌హెచ్‌ఎం)ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

కారు - బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

ఖిలా వరంగల్: దూపకుంట రోడ్డుపై కారు – బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన ఖిలా వరంగల్ మండలం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం రంగశాయిపేటకు చెందిన సంకేశి వేణు వ్యక్తిగత పనిమీద రంగశాయిపేట నుంచి దూపకుంట గ్రామానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో బైక్‌ను ఎండీ.ఆరిఫ్ కారు బలంగా ఢీకొట్టింది. దాంతో బైక్‌పై నుంచి రోడ్డు మీద పడిపోగా వేణుకు గాయాలయ్యాయి. ఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకొని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

శ్మశాన వాటికలో హైమాస్ట్ లైట్లు, బోరు ప్రారంభం

మడికొండ: 46వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, బోరుపంపును కార్పొరేటర్ మునిగాల సరోజన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, ఈదురు అనిల్, మునిగాల కరుణాకర్, వల్లెపు ఉపేందర్, గాండ్ల భిక్షపతి, దేవేందర్, వెంకటస్వామి, తిరుపతి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల చేయూత


కరీమాబాద్: సరుకులు అందజేస్తున్న 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ


న్యూశాయంపేట: జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రావు


రామన్నపేట: బియ్యం అందిస్తున్న ఏసీపీ కిషన్, ఫౌండేషన్ ప్రతినిధులు



కరీమాబాద్: సీపీఎం ఉర్సుగుట్ట కార్యాలయంలో మాట్లాడుతున్న రంగయ్య


రామన్నపేట: నిత్యావసర సరుకులు అందిస్తున్న మహిళా న్యాయవాదులు

కరీమాబాద్: భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన 32వ డివిజన్ భగత్‌నగర్, లక్ష్మీనగర్ వరద బాధితులకు కార్పొరేటర్ పల్లం పద్మ శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద ముంపు బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పల్లం రవి, పొగాకు సందీప్, సతీష్, కృష్ణవేణి, చిన్నారి, ప్రజ్ఞ, లావణ్య, ధనలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలి

కరీమాబాద్: భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీహెచ్.రంగయ్య డిమాండ్ చేశారు. ఉర్సుగుట్ట ఆర్ఎస్‌భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నగరంలో వరదల కారణంగా బాధితులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఆక్రమణలకు గురైన నాలాలను వెలికితీసి వాటిని సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముక్కెర రామస్వామి, రత్నమాల, బాబు, సాగర్, యాదగిరి, కుమార్, బషీర్, యాకుబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సీపీఐ సహాయం

న్యూశాయంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈక్రమంలో వరద బాధితులకు సీపీఐ తరఫున సహాయం అందించడానికి నాయకులు ముందుకొచ్చారు. బియ్యం, దుస్తులతో కూడిన వాహనాలు హనమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో నుంచి శుక్రవారం బయలు దేరాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ములుగు, భూపాలపల్లి జిల్లాల పరిధిలోని మోరంచపల్లి, కొండాయి గ్రామాలకు వాహనాలు తరలివెళ్లాయి. నాయకులు కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, ఆదరి శ్రీనివాస్, మునగాల భిక్షపతి, ఓదేలు, శంకర్ నాయక్, దీన, కుమార్, భిక్షపతి ఉన్నారు.

నిరాశ్రయులకు బియ్యం అందజేత

రామన్నపేట: వరంగల్ నగరంలోని 11వ డివిజన్ రంగంపేట ముంపు ప్రాంతంలో నిరాశ్రయులైన బాధితులకు కందుల సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఏసీపీ కిషన్ చేతుల మీదుగా ప్రతీ కుటుంబానికి 25కిలోల చొప్పున బియ్యాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ సభ్యుడు కందుల సృజన్, తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచిన మహిళా న్యాయవాదులు

రామన్నపేట: నగరంలో తీవ్రంగా కురిసిన వర్షాలకు అతలాకుతలమైన 11వ డివిజన్‌లోని పోతననగర్, రంగంపేట, సరస్వతినగర్ కాలనీవాసులకు మహిళా న్యాయవాదులు అండగా నిలిచారు. సుమారు 40 బాధితులకు రూ.40 వేల విలువగల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించొద్దు


మహా పడావ్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9, 10వ తేదీల్లో కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే మహా పడావ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు ప్రకారం మహాపడావ్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ ప్రతినిధులు చెన్నకేశవులు, మునీశ్వరుడు, ఉప్పల రవి, గోవర్దన్, జాన్‌పాల్, యాకోబ్, చంద్రిక, యాకయ్య, రాజు, చిరంజీవి, యోగానందచారి, కుమార్, రమేష్, సుధీర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

వరంగల్: వరంగల్ తహసీల్దార్‌గా ఎండీ.ఇక్బాల్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ఖిలా వరంగల్ తహసీల్దార్‌గా నాగేశ్వర్‌రావు

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ తహసీల్దార్‌గా బీ.నాగేశ్వర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఆయనను నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ఆనంద్‌కుమార్, జూనియర్ అనిల్‌కుమార్, సర్వేయర్ రజిత, ఏఎస్ఓ శ్రీదేవి, వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కాజీపేట తహసీల్దార్‌గా భావుసింగ్

కాజీపేట అర్బన్: కాజీపేట తహసీల్దార్‌గా భావుసింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు నాయబ్ తహసీల్దార్ హేమ, ఆర్ఐలు దశరథ రామిరెడ్డి, సురేందర్, సిబ్బంది బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హసన్‌పర్తి తహసీల్దార్‌గా ప్రసాద్

హసన్‌పర్తి: హసన్‌పర్తి తహసీల్దార్‌గా చల్లా ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ఆయనను పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి, డిప్యూటీ తహసీల్దార్ రహీం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రణయ్, కుమారస్వామి, సర్వేయర్ ఎర్రపెగడ, వీఆర్ఏలు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కేసులో సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ హనుమకొండలోని డీసీసీ భవన్ ఎదుట పార్టీ నాయకులు శుక్రవారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. సుప్రీం స్టేతో రాహుల్‌గాంధీ తిరిగి ఎంపీగా పార్లమెంట్‌లో తన గళాన్ని వినిపించనున్నారని నాయకులు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు బంక సరళ, మీర్జా అజీజుల్లాబేగ్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, పల్లకొండ సతీష్, బంక సంపత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురిని కాపాడిన పోలీసులు


మహిళను కాపాడుతున్న సీఐ రాజు, యువకులు


వాగు నుంచి బయటకు తీస్తున్న ఇన్‌స్పెక్టర్లు

కాజీపేట: వడ్డెపల్లి రిజర్వాయర్‌లోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహితను కాజీపేట పోలీసులతో పాటు స్థానిక యువకులు కాపాడి మెరుగైన వైద్య చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం హనుమకొండ పట్టణానికి చెందిన రాచకొండ అర్చన (35) సాయంత్రం రిజర్వాయర్ కట్టపై నడుచుకుంటూ వెళ్తూ ఆకస్మాత్తుగా నీటిలోకి దూకింది. ఆ సమయంలో కట్టపై పెట్రోలింగ్‌లో ఉన్న సీఐ సార్ల రాజు.. నీటిలో దూకిన ఆ మహిళను చూసి అక్కడున్న యువకులతో పాటు పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే యువకులు నీటిలోకి దూకి నీట మునిగిపోతున్న అర్చనను సీఐ రాజు సహాయంతో కాపాడి ఒడ్డుకు చేర్చారు. చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి పోలీసు వాహనంలో తరలించారు. అర్చన ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదని సీఐ రాజు తెలిపారు.

క్షతగాత్రుడిని రక్షించిన టీఎస్ఎస్పీ అధికారులు

మామునూరు: వరంగల్ హంటర్‌రోడ్డు సంతోషిమాత గుడి సమీపంలోని బొందివాగులో పేలుడు పదార్థం కారణంగా రెండు కాళ్లు కోల్పోయి విగతజీవిగా ఆర్తనాదాలు చేస్తున్న క్షతగాత్రుడిని శుక్రవారం అటుగా వెళ్తున్న టీఎస్ఎస్పీ 5వ బెటాలియన్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు జీ.కార్తీక్, రాంప్రసాద్.. తమ సిబ్బంది కుమారస్వామి, వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్‌లతో కలిసి బొందివాగు నుంచి బయటకు తీశారు. అనంతరం, చికిత్స నిమిత్తం టీఎస్ఎస్పీ బెటాలియన్ వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు వారిని 5వ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ సింధుశర్మ ప్రత్యేకంగా అభినందించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను కలిసిన ఈద్గా అధ్యక్షుడు జబ్బార్, కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ సూచించారు. ఇటీవల మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఖిలా వరంగల్ ఈద్గా కమిటీ ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడు ఎం ఏ.జబ్బార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల నగరంలో జరిగిన గొడవను ఉద్దేశించి సీఐ మాట్లాడారు. మత్తు పదార్థాలకు బానిసై విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. సన్మార్గంలో యువత పయనిస్తూ తల్లిదండ్రులకు గొప్పపేరు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఈద్గా ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషా, కార్యదర్శి హసన్ అలీ, సభ్యులు హైమద్‌ఖాన్, దస్తగిరి, వాహెద్, సాదిక్, మాషూక్, అశోక్, దస్తగిరి, నేహల్, షరీఫ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

కాశోజీ సెంటర్ : తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యసన కోసం ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధమైన సమయాన్ని వెచ్చించాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణ సూచించారు. ఖిలావరంగల్‌లో శుక్రవారం జరిగిన తొలిమెట్టు గణిత శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ తొలిమెట్టు ఉద్దేశాలను తరగతి గది వరకు తీసుకెళ్లి విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ విద్యార్థులకు గణితంపై ఉన్న అపోహాలు తొలగించి, కఠినత్వం కాదని తెలియజేయాలన్నారు.

వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించాలి

గీసుకొండ : అధిక రక్తపోటు, మధుమేహం, గుండె, పక్షవాతం, నోటి, గర్భస్థ, రొమ్ము కేన్సర్ల లాంటి అసంక్రమిత (ఎన్సీడీ) వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎన్సీడీ కార్యక్రమాలపై వైద్యులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–సంజీవని ద్వారా ఎన్సీడీ వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దే వైద్యం అందించాలన్నారు. వైద్య, ఆరోగ్య సేవలను ఆయుష్మాన్ భారత్ పోర్టల్‌లో ప్రతి రోజు అప్‌డేట్ చేయాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, నవీన్, రాజ్‌కుమార్, ఎన్సీడీ జిల్లా కోఆర్డినేటర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డీపీఓ అర్చన, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

కాశోజీ సెంటర్ : వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 7న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండలో పేటీఎంలో ఖాళీగా ఉన్న 30 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు విద్యార్హతల జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం హాజరుకావాలని, వివరాలకు 77993 14685 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

జాబితా ప్రదర్శన

కాశోజీ సెంటర్ : మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల విభా గంలోని చైల్డ్‌లైన్ (1098)కు సంబంధించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను పరిశీలించి, అర్హులు, అనర్హులను గుర్తించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.శారద ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం నోటీసు బోర్డుపై అభ్యర్థుల జాబితా ప్రదర్శించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు జిల్లా సంక్షేమ కార్యాలయంలో జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. 8వ తేదీన షార్ట్ లిస్టెడ్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

వరంగల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రతీఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని 21వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ ఫుర్కాన్ సూచించారు. వరంగల్ కాశిబుగ్గ శ్రీచైతన్య స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన స్మార్ట్ లివింగ్‌లో భాగంగా మొక్కలు నాటారు. పాల్గొని మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బండారి కిరణ్ కుమార్, డీన్ రంజిత్, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ జనార్దన్, ఏఓ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజేష్‌కన్నా లేని లోటు పూడ్చలేనిది

విద్యారణ్యపురి: ఇటీవల అనారోగ్యం బారినపడి మరణించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) హనుమకొండ పూర్వ జిల్లా అధ్యక్షుడు కే.రాజేష్‌కన్నా.. ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందించిన సేవలు మరువలేనివని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. కేయూ రోడ్డులోని ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం రాజేష్‌కన్నా సంస్మరణ సభ జరిగింది.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పరీక్షల సామగ్రిని అందజేశారు. వండ్లకుంట శిల్పా జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బొగ్గారపు రామకృష్ణ.. కంపాక్స్ బాక్స్‌లు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మామిడాల రాజేంద్రం, పద్మావతి, నర్సింహారావు, శైలజ, వీరస్వామి, శ్రీనివాసరావు, అనిత, నర్సయ్య, బాలు, శ్రీలత, జ్యోతికుమారి, రాణి తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పరామర్శ

కాజీపేట: సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎన్‌హెచ్ఎం –2 ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేసి నిర్బంధించడంపై డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈమేరకు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను శుక్రవారం వారు వేర్వేరుగా పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైల్వే ఉద్యోగి యోగక్షేమాలపై ఆరా

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన పెంట నాగరాజు అనే రైల్వే ఉద్యోగి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, ఆయనను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో సందెల విజయ్ కుమార్, ఇమ్మడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


కాశిబుగ్గ: మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

కాశిబుగ్గ: బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, తల్లిపాలు తాగిన పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జే.ఉపేందర్ రావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కాశిబుగ్గ వివేకానందకాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై అక్షరాభ్యాసం, అన్నప్రాసన, సీమంతం వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఉపేందర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వరంగల్ జిల్లా అధికారి ఎం.శారద మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు పుట్టినప్పటి నుంచి 6నెలల వరకు తల్లి పాలు మాత్రమే తాగించాలని వివరించారు. కాగా, తమ పాప గుండెలో రంధ్రం ఉందని, సహాయం చేయాలని చిన్నారి బైరి సంయుక్త తల్లిదండ్రులు కావ్యశ్రీ, రవితేజలు.. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉపేందర్‌రావును కోరారు. సీడీపీఓ విశ్వజ, సూపర్‌వైజర్ చాయాదేవి, అంగన్‌వాడీ టీచర్లు స్రవంతి, సరిత, వాణి, కవిత, భవాని, వనిత, ఆశ కార్యకర్త రజిత పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

హన్మకొండ చౌరస్తా: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా హనుమకొండ మచిలీబజార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో 15మంది గర్భిణులకు శుక్రవారం సామూహిక సీమంతాలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోవచ్చని జిల్లా సంక్షేమాధికారి మధురిమ తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల ముందస్తు అరెస్ట్


హసన్‌పర్తి: పోలీసుల అదుపులో ఏఎన్ఎంలు


మడికొండ పోలీసు స్టేషన్‌లో ఏఎన్ఎంలు

హసన్‌పర్తి: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఏఎన్ఎం –2, యూరోపియన్ ఏఎన్ఎంలు శుక్రవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఏఎన్ఎంలను అరెస్ట్ చేశారు. హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ తమ డిమాండ్లు నెరవేర్చకుంటే శాంతియుత పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాంబరాజ్ సమత, మేకల సులోచన, విజయనిర్మల, నద్దునూరి సుమలత, రజిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ: ఏఎన్ఎంలు –2 చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో వారిని మడికొండ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులు అన్యాయమని వారు వాపోయారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేసినట్లు ఎస్సై దివ్య తెలిపారు.

బహుజన విద్యార్థి గర్జన పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఈనెల 8వ తేదీన జరగబోయే బహుజన విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా రీజియన్ జనరల్ సెక్రటరీ కన్నం సునీల్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట విద్యార్థి గర్జన సభ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యను వ్యాపారంగా చేస్తున్న బకాసురులను తరిమేద్దామని అన్నారు. ఎన్నికల హామీలను సీఎం కేసీఆర్ అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బొట్ల కార్తీక్, మాదారపు రవికుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఒంటేరు చక్రి, బహుజన విద్యార్థి సంఘం నాయకులు మచ్చ పవన్‌కల్యాణ్, దూడపాక అశోక్, మాసాని ప్రదీప్, అల్లూరి శ్రీకాంత్, విష్ణుప్రియ, సంరీన్, వినీత, సబిత తదితరులు పాల్గొన్నారు.





సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)